ఓగిరాల వీరరాఘవ శర్మ కీర్తనలు

అకారాది సంకీర్తన సూచిక

19. కామేశ్వరి నీపదకంజములే గతియని(కాంభోజి –ఖండజాతి త్రిపుట)

20. కాలవికృతమున పాలబడు(వరాళి – ఆది)

21. కావవే కమలాక్షి అంబ(జగన్మోహిని – ఆది)

22. కులమేదైతె నేమిరా(మందార – ఆది)

23. చెప్పుకొంటినమ్మా జననీ(ముఖారి – ఆది)

24. చేత కాసున్నపుడే దానధర్మములు(మాయామాళవగౌళ – ఆది)

25. జ్ఞానభిక్షమిడవే జననీ(బహుదారి – ఆది)

26. తనవారని నమ్మిచెడకురా(సామ – ఆది)

27. తనువే ధర్మార్థకామమోక్షము లార్జింపదగు(గౌళ – ఖండజాతి అట)

28. తరుణమిదే శివ తరుణీమణి(మోహన – ఆది)

29. తల్లీ సదా నీపద(మణిరంగు – ఆది)

30. తామసము శమింపగరాదా అంబ(అఠాణ – ఆది)

31. దేవి కనకదుర్గాంబా పరశివ(రుద్రప్రియ – ఆది)

32. దేవీ కామాక్షీ(మాయామాళవగౌళ – ఆది)

33. దేవీ గాయత్రీ నీసాటి(హుసేని – ఆది)

34. దేవీ పార్వతి జగదేకసంవర్ధని(మధ్యమావతి – రూపక)

35. నన్నుబ్రోవ నీకన్న(సారంగ – ఆది)

36. నాదానందాను భవశాలికి(ఖరహరప్రియ – ఆది)

37. నామ సుమార్చన జేతు సదాశివ(మాయామాళవగౌళ – ఆది)

38. నాయెడ మంచితనము లేక(కల్యాణి – ఆది)

39. నీ పదధ్యానము గల్గిననాడే(రీతిగౌళ – ఆది)

40. నీ భక్తవరుల కిలలో(దర్బారు – త్రిశ్రజాతి త్రిపుట)

41. నీ సేవకు తగు నిపుణతలేదని నాయెడ(సావేరి – మిశ్రజాతి ఝంపె)

42. నీకే దయరాదా జననీ నాపై(చక్రవాక – ఆది)

43. నీపయి నామనసు నిల్ప(ముఖారి – రూపక)

44. నేడే నిను సేవింపవలె గాని(ఆనందభైరవి – మిశ్రచాపు)

45. పదారవిందములే గతియని(ప్రణవప్రియ – ఆది)

46. పరశివ సుదతీ పార్వతీ(పూర్వీకల్యాణి – ఆది)

47. పరాత్పరీ శివకామేశ్వరీ(నాదానందరంజని – ఆది)

48. పరాశక్తి సదా భక్తార్తిభంజనివి కదా(తోడి – సంకీర్ణజాతి త్రిపుట)

49. పాదయుగ సరోరుహం(బిలహరి – రూపక)

50. పాపమే జ్వరాది ఘోర(ధన్యాసి – చతురస్ర త్రిశ్ర ఆది)

51. పార్వతీ నిరపరాధి నేగతి(గౌళ – ఆది)

52. పిన్నవానిగా నన్ను – పిలచి బ్రోవవే భవాని(మాయామాళవగౌళ – రూపక)

53. భక్తికి సమభాగ్యములేదని శివ(సామ – ఆది)

54. భజింపలేదని మదిలో నను(కేదార – ఆది)

55. మదనారీవర సుదతి మహేశ్వరి(కానడ – ఆది)

56. మనసా సదాశివ మానిని(సురట – ఆది)

57. మనసున నిన్నే గురిజేసి(భైరవి – త్రిపుట)

58. మీనాక్షీ నీదు పదపంకజములె(తోడి – ఆది (తాన వర్ణము))

59. ముందువారలేమైరో(పూర్వీకల్యాణి – రూపక)

60. యోగసుఖ వియోగున(అఠాణ – రూపక)

61. రాజరాజేశ్వరి నీపద(మోహన – ఆది)

62. రారె రమణులంతా(కేదార – ఆది)

63. రావమ్మ జననీ శ్రీ రాజరాజేశ్వరి(రీతిగౌళ – మిశ్రజాతి చాపు)

64. వదలిపోయేనాడు నీవెంటతోడై(పూర్వీకల్యాణి – ఆది)

65. వలసినదేమీ జననీ మాకీ(రీతిగౌళ – ఖండత్రిపుట)

66. విడచి సుఖింపవె మనసా(మధ్యమావతి – రూపక)

67. విన్నానమ్మా జననీ నీకథ(మణిరంగు – ఆది)

68. వెఱ్ఱినమ్మికతో నీవిఱ్ఱవీగుటె కాని(సావేరి – త్రిశ్రజాతి త్రిపుట)

69. వే రెవ్వరమ్మ జనని నీసరి(రీతిగౌళ – ఖండజాతి త్రిపుట)

70. వేషధారుడైన నరునికిలలో(శంకరాభరణము – ఆది)

71. శంకర కోమలి శరణుజొచ్చితి(దర్బారు – ఆది)

72. శంకరార్ధ శరీరిణి(శంకరాభరణము – ఆది)

73. శక్తి జగజ్జననీ పాహీ పాహిమాం(బేగడ – రూపక)

74. శైలతనయ నీ పాటి(ఫరజు – ఆది)

75. శ్యామలగాత్రి పరాశక్తి అంబ(జంఝూటి – ఆది)

76. శ్రీ గాయత్రీదేవి సనాతని(వలజి – ఆది)

77. శ్రీకాంత సోదరీ నన్నుబ్రోవ(ఫరజు – ఆది)

78. సదాశివనాయకీ అంబ భవజల(ఫరజు – ఆది)

79. సద్గురుచరణ సరోరుహ భక్తి వినా(బేహాగ్ – ఖండజాతి త్రిపుట)

80. సారహృదయులై కడతేరుట కేనాటికైనా(జనరంజని – సంకీర్ణజాతి త్రిపుట)

81. సితనగ నిలయుని సుదతీ సుమతీ(వివర్ధిని – ఆది)

82. సుందరి సదా నీ పదారవిందములకు(శుద్ధధన్యాసి – ఆది)

83. సుమశరహరవర సుదతీ పార్వతి(ఆభోగి – ఆది)

84. స్వరజనితోంకారనాదాఖండ(ఆరభి – ఖండజాతి త్రిపుట)

85. హరనారీ నామాక్షరరుచి(మధ్యమావతి – ఆది)

86. హారతి జేకొనవే అంబా(సురట – ఆది)

01. మోహన – ఆదిపల్లవి:అంతా బ్రహ్మమయమురా

ఈ జగదుదంత మెరిగిన నిగమాంత కోవిదుల॥కంతా॥

అనుపల్లవి:సంతతధామ మనంతనామ మా

ద్యంత రహితమై అహరహము వెలిగే॥దంతా॥

చరణము(లు):సకల భూత కులమతముల తా నిష్క

ళంకమై నెగడు నిర్వికారమురా

ప్రకటిత రాగభావతాళ చయమం

దొకటై తనరు రాఘవార్చిత నాదాఖండ॥మంతా॥

02. సావేరి – ఆది

పల్లవి: అందుకొనవమ్మా ఓ త్రిపుర

సుందరీ కర్పూరానంద నీరాజన ॥మందుకొన॥

అనుపల్లవి:

ఇందరిలో నా డెందము రంజిల్ల

వందనము జేసి వసుధ నిను దలతు ॥నందుకొన॥

చరణము(లు):

భావరాగతాళముల జతగూర్చి

పావనమగు నీనామాక్షర గాన ప్ర

భావముచే భక్తవాహినిలో శ్రీ

దేవీగానసుధాకృతిగా నినుజూచితి ॥నందుకొన॥

03. జ్ఞానానందవర్ధని – ఆది

పల్లవి:

అపార కృపానిధివని నీనామ

మేపార నామది నుపాసింతునే అంబ ॥అపార॥

అనుపల్లవి:

కపాలశంఖచక్రగదాంకుశ ఖడ్గధారిణి

మాపాలి దైవమా శ్రీ మహేశ్వరి గాయత్రి ॥అపార॥

చరణము(లు):

సనాతనీ సచ్చిదానంద రూపిణి

శ్రీనాథానంద సద్గురు తీర్థోపాసిని

అనాదిగా హరిహరాది సురలెల్ల

ఘనాభి నుతులిడరె జ్ఞానానంద తీర్థార్చిత ॥అపార॥

04. హిందోళ – రూపక

పల్లవి: ఆదిశక్తి శంకరి న – న్నాదరింపవే ఓ జగ ॥దాది॥

అనుపల్లవి:

వేదాగమవాసిని నా – విన్నపంబు లెల్ల విన

రాదా శుకపాణి దీన – రక్షకి యను బిరుదులేదా త్రిజగ ॥దాది॥

చరణము(లు):

రజతాచలమందు శివుని – రమణీయముగాను గూడి

రాజిల్లు సకలముని సు – రాదివందిత పాదవాద

గజముఖుని రీతి నన్ను – కరుణింపవె కల్పవల్లి

నిజదాసుడౌ రాఘవుని – మన్నింపను నీమదిని సదా త్రిజగ ॥దాది॥

05. శుద్ధధన్యాసి – రూపక

పల్లవి:

ఆలించి పాలించు అఖిలాండేశ్వరి నా మొ ॥రాలించి॥

అనుపల్లవి:

లాలించి కన్నబిడ్డల నలరించు తల్లి కైవడి నా మన ॥వాలించి॥

చరణము(లు):

కాలరూపిణీ సదాశివకామినీ జగత్కారిణీ యని చిర

కాలము మదిరంజిల్ల నిష్కామభక్తిజేయు రాఘవుని కు ॥య్యాలించి॥

06. తోడి – ఆది

పల్లవి:

ఈ నాడెవరితో మొరలిడుదు

ఇందుముఖి త్రిపురసుందరి యిక ॥ఈ॥

అనుపల్లవి:

ఆనాటి మొదలు నీ పదయుగ

మాశ్రయించియున్న నా శ్రమ దీర్పవు ॥ఈ॥

చరణము(లు):

కొదువలేక ఎల్లవేళల తోడై న

న్నాదుకొందువని అంతరంగమున

పదము వీడ రాఘవుని నిజభక్తి

విధమెరిగి బ్రోచు వితరణ లేకుంటే ॥ఈ॥

07. ఆరభి – ఖండజాతి ఆట

పల్లవి: ఊరక దొరకునా ఉమాపదసరసిజ మాత్మనిల్పను తన ॥కూరక॥

అనుపల్లవి: పోరాడి శత్రుచయమారింటి దునిమి తలపులెల్ల శివసతిపై నిడ॥కూరక॥

చరణము(లు):

ధరణీసురవర ధర్మమరసి యజ్ఞకర్మాదుల గల మర్మమెరుగ ॥కూరక॥

పరమభక్తజన పావని, స్మరరిపుమానిని, భవభయహారిణి,

త్రిభువనపాలిని, కమల కపాల గదా శుక శూల విలాసిని ॥ఊరక॥

ధనసుదతీమణి తనయులయెడగల తమకమున దగిలి తనపెరయని

బహుతమమున మునుగుచు పరతత్వ మహత్వమెరుగని నరున ॥కూరక॥

పరమానందసుఖ మాత్మకిడు నిజమార్గమెరుగు సమాధియుతు,

పదమాశ్రయించి, ఉమాకథ లభిమానమున విన ॥కూరక॥

రాఘవగీత స్వరములందు, శ్రుతిరాజిలుచు,

నాధారమగు నోంకారనాద, తరంగలయ, మకరంద రుచి లే ॥కూరక॥

08. వకుళాభరణ – ఆది

పల్లవి: ఎంచి నీ నామము నామదిలో స్మ

రించెదనె శివ కంచికామాక్షి అంబ ॥ఎంచి॥

అనుపల్లవి: సంచితముల హరియించి సనాతని

వంచన జేయక వరములొసగుమని ॥ఎంచి॥

చరణము(లు): పంచబాణుని దహించిన దొర భ్రమి

యించిన నీ సొగసెంచ నా తరమె

చంచలాక్షి కరుణించ సమయమే

అంచితముగ రాఘవుడు సుస్వరముతో ॥ఎంచి॥

09. కీరవాణి – ఆది

పల్లవి:

ఎందుకీ భువిలో నరుడై తా

నేర్పడెనో ఎంచి చూడవే మనసా ॥ఎందుకీ॥

అనుపల్లవి:

అందరాని దుర్మోహ దురాశల

జెంది సతత మీభవబంధమున వగచుటకా ॥ఎందుకీ॥

చరణము(లు):

పరమత కులముల దూరుటకా లేక

పరమార్థమెరిగి ధర్మాచరణుడౌటకా

సరసాత్ములతో విరసములాడుటకా భూ

సురుడౌ రాఘవుడు భోగలాలసుడౌటకా ॥ఎందుకీ॥

10. ఖమాస్ – ఆది

పల్లవి: ఎపుడైనా భిన్నమౌ దానికొరకు

ఇంత మమత యేటికే ఓమనసా ॥ఎపుడైనా॥

అనుపల్లవి: ఇపుడైనా దేహిదేహ భేద మరసి

నిపుణతతో నిత్యానిత్య తత్వమెరుగక ॥ఎపుడైనా॥

చరణము(లు):

పవనాది పంచభూత విస్తృతమౌ

నవద్వారావృత దేహసౌధమున

నివసించే పరబ్రహ్మమె నిత్యమని

వివరముగాదెల్పు రాఘవుని మాటవినక ॥ఎపుడైనా॥

11. కేదారగౌళ – ఆది

పల్లవి: ఏమి కావలెనే మనసా భువి శివ

కామినీ మది పదకంజ భక్తి కన్నా మన ॥కేమి॥

అనుపల్లవి: కామితార్థ ఫలము లేకాల మొసగు

ప్రేమరూపిణి జనపెన్నిధిగా మన ॥కేమి॥

చరణము(లు):

వేదశాసనాను వర్తనులై

విధిహిత కర్మాచరణముచే కర్మశీలుడై

మోదమలర పరతత్త్వోపాసన చేయు శ్రీ

దేవీగానసుధాపాన మత్తచిత్తుల కిక ॥నేమి॥

12. వాచస్పతి – ఖండజాతి త్రిపుట

పల్లవి:

ఒంటరిగా విదేశముల కనుపక నా

వెంటరావలెనమ్మ ముక్కంటి నీబంటు ॥నొంటరిగా॥

అనుపల్లవి:

కంటిరెప్పకైవడి నాదు వెను

వెంట నిలచి దుర్ఘటసంకటముల దీర్పవలె ॥నొంటరిగా॥

చరణము(లు):

నిజదార సుతోదర పోషణ కేప్రొద్దు

నిన్ను మరచి పోనాడ కనిశము జగతిని

భజన సుగతినిడు పథమని యెంచిన తనకు

విజయములిడి ఎల్లవేళల రాఘవుని కృపజూడక ॥నొంటరిగా॥

13. ఆరభి – ఝంపె

పల్లవి: కలవారినమ్మి మది – కలతచెందగ నేల

కామితార్థము లొసగు – కల్పవల్లివి నీవుండగ అంబ ॥కలవారి॥

అనుపల్లవి: కలకాల మతిఘోర – కర్మబద్ధులై జగతి

కలిమి గల్గుట నీదు – కరుణఫలమని తెలియక

కలినింగిత మెరుగని – మానవు లాడెడి మా

టలువిని కరుణమాలి – కఠినోక్తులు ఘనమని

నన్నలయబలికి బుణ – పడి భువిబ్రతికెడి సిరి ॥కలవారి॥

చరణము(లు): నిత్యమని భ్రమసి కడు – నీచులై మురిసేరు

సత్యము గనలేక మద – మత్తులై నన్నాడేరు

నిత్యానిత్య వివేక – నేర్పరులుగాక మది

భృత్యుడగు రాఘవుని – బూని వంచనచేసెడి లోభము ॥కలవారి॥

14. కేదారగౌళ – మిశ్రజాతి ఝంపె

పల్లవి: కలుగునా కామాక్షీ నీదయలేక

కలిమానవులకు నీ పదకంజములపై భక్తి ॥కలుగునా॥

అనుపల్లవి: ఇలధనదార సుతాది దుర్మోహ దురాసక్తులై

పలుజన్మల భవబద్ధులైన పామరులకు ॥కలుగునా॥

చరణము(లు):

పరమ భాగవతులను శంకించు నపచారులై

వెరపులేక పరదార గమనోల్లాసులై

స్థిరముగాని తమ కలిమి బలమున కుప్పొంగుచు

దురితాత్ములై చరించి రాఘవుని దూరితె ॥కలుగునా॥

15. రేగుప్తి – ఆది

పల్లవి: కాదనకే శివకామేశ్వరి భవ

కాననమున నా గాసిదీర్ప వల్ల ॥గాదనకే॥

అనుపల్లవి:

ఆదుకొని భక్తాభీష్ట మొసగు నీకు

సాధుగణరిపు సంహారము చేత ॥గాదనకే॥

చరణము(లు):

ఆపనేర నీప్రాపులేక ఘోర

పాపాత్ములిడు సంతాప భారమును

ఏ పనికిల రాఘవు నంపితివో

ఆ పనిని దీర్చి ఆదరింపు మిక ॥కాదనకే॥

16. భైరవి – ఆది

పల్లవి: కాదనేరు జననీ కలినరులు

కార్యకారణకర్త్రివై వెలిగే నిను ॥కాదనేరు॥

అనుపల్లవి:

పాదయుగపశువులై ధర బుట్టిన

పాపమునకు సంతాపము జెందక ॥కాదనేరు॥

చరణము(లు):

నిత్యమై నిగమాంత పరతత్త్వమై

సత్యాఖండ సమాధినెగడు నిన్ను

కృత్యాకృత్యవివేకవిహీనులెటు

గుర్తింతురు రాఘవునితో కుతర్కించి ॥కాదనేరు॥

17. షణ్ముఖప్రియ – రూపక

పల్లవి:

కాపాడను నీవేగద

కలిలో శివకామసుందరి నను ॥కాపాడను॥

అనుపల్లవి:

లోపాలోపముల మది నవ

లోకించుచు జాగుసేయక ॥కాపాడను॥

చరణము(లు):

ప్రణవనాదముచేత నిన్ను – బ్రస్తుతింపగా సతతము

గుణవిహీనుడనై మరి – ఘోషింపగవలసె జననీ

ఫణిపతిభూషణునికి ప్రియ – రాణివైన శ్రీరాజేశ్వరి రాఘవుని ॥కాపాడను॥

18. తోడి – ఆది

పల్లవి: కామాక్షీ సదా నీ పద కం

జములే గతియని నమ్మితినే కంచి ॥కామాక్షీ॥

అనుపల్లవి:

ఈ మానవజన్మకు సఫలమని ని

ష్కామభక్తితో నిన్నారాధించి ॥కామాక్షీ॥

చరణము(లు):

ధరాతలి యశోధనకాముడనై

పురాణి నిన్నుకోరి పూజింపనేర

జరామరణములు దీర కరుణమీర

పారజూచి నన్ను పరిపాలింపుము రాఘవనుత ॥కామాక్షీ॥

19. కాంభోజి –ఖండజాతి త్రిపుట

పల్లవి: కామేశ్వరి నీపదకంజములే గతియని
నమ్మి పూజించెదనే శివ॥కామేశ్వరి॥

అనుపల్లవి:
ఈమేదిని అరుదై దొరకే నర
జన్మ తనకబ్బియున్న ఈవేళనె ॥కామేశ్వరి॥

చరణము(లు):
మనసార తులసీ బిల్వాది కుముద
మందారారవింద మల్లికా సుమములచే
నెనరుమీర ఆగమవిధి ననుసరించి
దినదినము రాఘవుని మై పులకరింప ॥కామేశ్వరి॥

20. వరాళి – ఆది

పల్లవి: కాలవికృతమున పాలబడు కష్ట
జాలములకు భయమేలనే మనస ॥కాల॥

అనుపల్లవి: జాలిదీర్చి భక్తపాలనజేయు
ఫాలనేత్రి మనపాల గల్గియుండ॥కాల॥

చరణము(లు):
దారసుతులతో గూడిన యీ సం
సారమున సుఖవిచారములేప్రొద్దు
వేరుగాక ఆమరణము నరునికి
చేరువై నెగడు రాఘవాఘఫల ॥కాల॥

21. జగన్మోహిని – ఆది

పల్లవి:

కావవే కమలాక్షి అంబ

కామిత ఫలదాయకీ నన్ను ॥కావవే॥

అనుపల్లవి:

భావ మలర నీ పదవనజములే

బట్టి వేడితిని పావని శంకరి ॥కావవే॥

చరణము(లు):

దీనులయెడ నీ వనయముజూపిన

ఘనమగు కరుణ నే గావలెనంటిగా

తనయుని భవజలధి దాటింపను

కనికరమిడవే గౌరి రాఘవుని ॥కావవే॥

22. మందార – ఆది

పల్లవి: కులమేదైతె నేమిరా తన

తొల్లిజన్మార్జిత కర్మఫలజమగు ॥కుల॥

అనుపల్లవి: జలజాసనహరిహరులను గన్న

తల్లి పరాశక్తిని దలచి ధన్యుడౌటకు ॥కుల॥

చరణము(లు):

ధర ప్రథితాత్మకమగు భరతావని

పరగు గుణకర్మభాగ వశముచే

నరుడు నాల్గువర్ణముల జనించు వి

వరమెరిగిన రాఘవ వినుతున కిక ॥కుల॥

23. ముఖారి – ఆది

పల్లవి: చెప్పుకొంటినమ్మా జననీ నా
త్రిప్పట లెల్ల నీతో ॥చెప్పుకొంటి॥

అనుపల్లవి: మెప్పులేని ధనకాములతో వియ్యము
తప్పదాయె తగుధనమెటు చేకూర్తువో ॥చెప్పుకొంటి॥

చరణము(లు):
ఏనాటి పాపమో ధనహీనులై కొంద
రీనాటి మానవులు మగువల గను
చున్నారిల విధివశమున దీనులై యా
పన్నరక్షకీ జగము తీరెల్ల రాఘవుని ॥చెప్పుకొంటి॥

24. మాయామాళవగౌళ – ఆది

పల్లవి:
చేత కాసున్నపుడే దానధర్మములు
చేసుకోరాదా మనసా చీకాకుపడక నీ ॥చేత॥

అనుపల్లవి:
నీతియుతులౌ నిగమాగమకోవిదులకు
ఖ్యాతిమీర పరమభాగవతులకు నీ ॥చేత॥

చరణము(లు):
పేదసాదలపై పెద్దమనసుజేసి
ఆదరించి సంతతాన్నదాతవై
ఈ ధర సతీసుతులపైని మోహమణచి
సాధుగతి రాఘవసన్నుత సాయుజ్యముకై ॥చేత॥

25. బహుదారి – ఆది

పల్లవి: జ్ఞానభిక్షమిడవే జననీ నా య
జ్ఞానమణచి సుజ్ఞానునిగాజేయు ॥జ్ఞాన॥

అనుపల్లవి:
జ్ఞానప్రసూనాంబా యీభవ
కాననమున తుదిగానలేక నిను వేడితి ॥జ్ఞాన॥

చరణము(లు):
కన్నతల్లి యాపన్నరక్షకీ నా
విన్నపము విని ప్రసన్నమూర్తివై
నిన్నెగాని తన మనసున కన్యము
ఉన్నతిగాదని యుప్పొంగు రాఘవునికి ॥జ్ఞాన॥

26. సామ – ఆది

పల్లవి: తనవారని నమ్మిచెడకురా నిజ
తరుణీ తనయ దాయాద స్వజనులంతా ॥తన॥

అనుపల్లవి:
మనసార స్మరరిపు మానినీపద
మారాధించుటె తుదకాధారమౌ గానీ ॥తన॥

చరణము(లు):
వట్టి బూటకానుబంధ మిదని బాగా
తట్టి నీకెవ్వరీగుట్టు తెల్పేరు
మట్టిపాలై మాపోరేపో మరెన్నడో
మటుమాయమౌ ఈ దేహభ్రాంతి మానలేక రాఘవ ॥తన॥

27. గౌళ – ఖండజాతి అట

పల్లవి:

తనువే ధర్మార్థకామమోక్షము లార్జింపదగు సాధనము ॥తనువే॥

అనుపల్లవి:

వినవే మనసా సకలేంద్రియముల చక్కనై వెలిగే మానవ ॥తనువే॥

చరణము(లు):

నాక పితృలోక వాసులకే కాలమాశ్రయమై రాజిల్లు ॥తనువే॥

సఫల మనోరథుడౌట కెంచి యాగాది సుకర్మము లాచరించి

దేవేంద్రాది సురగణములకు హవిర్భాగములను బంచు ॥తనువే॥

అన్నసార మాధారమై భువిని రుధిరమాంసమేధస్సులచే

నభ్యున్నతిజెంది దుర్విషయాదులకు లోబడి చెడని ॥తనువే॥

సకలజీవరాసుల నరుదైదొరకు నరజన్మమిదిగాక

భరతభూమిని జనించు ప్రబలపుణ్యధనయుతమై బరగెడి ॥తనువే॥

నాదయోగజిజ్ఞాసగలిగి ప్రజ్ఞానవరగురు ప్రముఖవికాసుని

ప్రేమగొలిచి సుజ్ఞాన సులక్షణశిక్షితుడై తా

వాదతర్కముల మాని మౌనియై నాదాఖండవిభూతి

నాత్మగని రాఘవసన్నుత చిదానంద చిద్రూపముజెందు ॥తనువే॥

28. మోహన – ఆది

పల్లవి: తరుణమిదే శివ తరుణీమణి
తనవాడని బ్రోచుటకు నీకు మంచి ॥తరుణ॥

అనుపల్లవి:
కరుణాకరి స్మరజనక సహోదరి నీ
మరుగు జేరితి ధర్మార్థకామమోక్షదాయిని ॥తరుణ॥

చరణము(లు):
భక్తజన ఘనవిపత్తు లణచు
పరాశక్తి చాముండేశ్వరి గుహజననీ
రిక్తుని ఘోరభవాబ్ధి దాటుట క
శక్తుని వరివస్యాసక్తుని రాఘవుని బ్రోచు ॥తరుణ॥

29. మణిరంగు – ఆది

పల్లవి: తల్లీ సదా నీపద
పల్లవములె కదా నమ్మినారము ॥తల్లీ॥

అనుపల్లవి: ఉల్లాసమెంతో గల నా
ఉల్లము రంజిల్ల పూజించి ॥తల్లీ॥

చరణము(లు):
ఎన్ని జన్మలకైనా తుదకు నీ
సన్నిధిజేరు సౌభాగ్యమె
ఉన్నతమని యెంచి యుప్పొంగుచు
అన్నివేళల ఆజన్మముకోరి
యున్న రాఘవుని కోర్కె లాలించి బ్రోచు॥తల్లీ॥

30. అఠాణ – ఆది

పల్లవి: తామసము శమింపగరాదా అంబ

ధర్మస్వరూపిణి దయజేసి నా ॥తామసము॥

అనుపల్లవి: యీ మహి నీపదధ్యాన మేమరకుండు

ఇంగితముగూర్చి ఇహపరదాయకి ॥తామసము॥

చరణము(లు):

భూసురుడనై నే బుట్టి నిగమాది

పుణ్యకర్మ లెరుగనైతిని పావని

భాసురగాత్రి సద్భావముతోడను

భవభయములెల్ల హరింపవె రాఘవుని ॥తామసము॥

31. రుద్రప్రియ – ఆది

పల్లవి: దేవి కనకదుర్గాంబా పరశివ

దేహార్ధధారిణి నన్ను బ్రోవవే ॥దేవి॥

అనుపల్లవి:

వివిధాలంకారమూర్తివై

విజయవాడను విలసిల్లు మా తల్లి ॥దేవి॥

ముక్తాయి స్వరము:

చరణము(లు):

ఆపదలకులోనై బహు

తాపము జెందిన తనయునిపై

కృపజూపి నీ పదభక్తి గూర్చి

సఫలముగా రాఘవుని సాకు ॥దేవి॥

32.

మాయామాళవగౌళ – ఆది

పల్లవి: దేవీ కామాక్షీ పర

శివదేహార్ధదాయినీ నన్ను బ్రోవవే ॥దేవీ॥

అనుపల్లవి:

నీవే త్రిభువనాధీశ్వరి యని పొగడి

దేవేంద్రాది సురభూసురులెల్ల సేవింపరె ॥దేవీ॥

చరణము(లు):

చిరకాలముగ నీ చరణాంబుజము లే

మర కారాధింపుచు మదివేడితి జననీ

శరదిందుముఖి కాంచీపురాధీశ్వరీ

ధర నిరుపమ జ్ఞానానంద తీర్థార్చిత ॥దేవీ॥

33. హంసేని – ఆది

పల్లవి: దేవీ గాయత్రీ నీసాటి

దైవమెవరిల జగదేక సంవర్ధని పర ॥దేవీ॥

అనుపల్లవి: నీవే బ్రహ్మము నీవే త్రిగుణము

నీవే సకలము నిగమపంజరశుకి ॥దేవీ॥

చరణము(లు):

రవిమండల వాసిని సుహాసిని

భవతరణి మందేహాసురభంజని

నవశశికళాధర పంచవర్ణానన

భువి రాఘవకృత గీతగాన సమ్మోదిని ॥దేవీ॥

34. మధ్యమావతి – రూపక

పల్లవి: దేవీ పార్వతి జగదేకసంవర్ధని పరశివ ॥దేవీ॥

అనుపల్లవి:

సేవక సురపతి మునిజన సు

శ్రేయోదాయకి నన్ను బ్రోవవె ॥దేవీ॥

చరణము(లు):

భానుతేజానన భక్త

పాపశమన భవతరణ దేవీ

గానసుధాకరి శంకరి

జ్ఞానానంద తీర్థార్చిత ॥దేవీ॥

35. సారంగ – ఆది

పల్లవి:

నన్నుబ్రోవ నీకన్న వేరెవ్వ

రున్నారు ఆపన్నరక్షణి ఇలలో ॥నన్ను॥

అనుపల్లవి:

కన్నతల్లి ఆదిలక్ష్మి కామేశ్వరి

తిన్నగా భవాబ్ధి దాటించి దయతో ॥నన్ను॥

చరణము(లు):

గుట్టువిడచి సాటి నరుల చెంతజేరి

పొట్టకూటికై బొంకులాడగలనా

దిట్టరివని నమ్మిన రాఘవుని

రట్టుదీర్పు దీనరక్షణివి గావా ॥నన్ను॥

36. ఖరహరప్రియ – ఆది

పల్లవి: నాదానందాను భవశాలికి

నానావిధ యోనిజనన బాధలుండునె మనసా ॥నాదా॥

అనుపల్లవి:

వేదవిదిత సుస్వర – విధమెరిగి నిఖిల

సాధువరులు మన – సార సేవించు ప్రణవ ॥నాదా॥

చరణము(లు):

లయశ్రుతి బద్ధమౌ – లాలిత్యముతో

నియమనిష్టలోలుకు – నిజభక్తితో

కాయజరిపుప్రియ – కాంతామణిముఖ

సోయగమును జూచి– సోఽహమ్మను

రాఘవనుత వర ॥నాదా॥

37. మాయామాళవగౌళ – ఆది

పల్లవి: నామసుమార్చన జేతు సదాశివ

నాయకి నీచరణాంబుజములకు శత ॥నామ॥

అనుపల్లవి: కోమలగాత్రి కుమారజననీ

వామిని కామేశ్వరి వరదాయకియని ॥నామ॥

చరణము(లు):

తులసీ బిల్వ చామంతి పున్నాగ

మల్లి మరువ కరవీర కమలములచే

ఉల్లము రంజిల్ల ఎల్లవేళల

పల్లవపాణి భవానీ రాఘవుని యనంత ॥నామ॥

38. కల్యాణి – ఆది

పల్లవి: నాయెడ మంచితనము లేక ని
న్నాదుకొనగ ఫలమా నతార్తిభంజని ॥నాయెడ॥
అనుపల్లవి:
మాయాతీత స్వరూపిణి జనని కా
మాదుల వశమై ఘడియ ఘడియకు ॥నాయెడ॥
చరణము(లు):
పరమైన గంగాస్నాన మాడితిన – వలచి సుజ్ఞానుల వచన మాలించితిన
నిరపరాధముగ నిను సేవింప – నేరని నీచుల చెలిమిని గోరి
మారవైరిమనోహరి సుకు – మారి సుందరి మహిత కల్యాణి
ఘోరపామరత్వమును బాపి నా – కోర్కెలొసగు రాఘవాఘమోచని ॥నాయెడ॥

39. రీతిగౌళ – ఆది

పల్లవి: నీ పదధ్యానము గల్గిననాడే
నిత్యానందముగా గడచునమ్మ ॥నీ॥
అనుపల్లవి:
తాపత్రయముల సంతాపము జెందక
ఓ పరాత్పరీ ఓంకారీ యని ॥నీ॥
చరణము(లు):
త్రిభువన నాయకి త్రిపురాంతకి శ్రీ
త్రిపురసుందరి త్రినేత్రి పావని
మాపురేపు మనసు రంజిల్లగ
కృపామయీ శివకోమలి రాఘవునికి ॥నీ॥

40. దర్బారు – త్రిశ్రజాతి త్రిపుట

పల్లవి:

నీ భక్తవరుల కిలలో

నీచోచ్చదశ లేకముగా దోచునమ్మ ॥నీ॥

అనుపల్లవి:

శోభిల్లు శ్రీ శివకామ

సుందరి నిజతత్వాయత్త చిత్తులగు ॥నీ॥

చరణము(లు):

నిర్మలమతితో నిత్య – కర్మల కిరవైన

ధర్మనిష్టులై బరగే – సమ్మతిగల రాఘవసన్నుతులా ॥నీ॥

41. సావేరి – మిశ్రజాతి ఝంపె

పల్లవి:

నీ సేవకు తగు నిపుణతలేదని నాయెడ

నిర్దయజూపేవా జననీ నిగమాగమ హితమౌ ॥నీ సేవకు॥

అనుపల్లవి:

దాసజనావనియని మనసారగా వన

జాసనాది సురవరులు బొగడి సేవించిన ॥నీ సేవకు॥

చరణము(లు):

కామజారి వామాంకముపై కైలాసగిరిని

ప్రేమమీర శివకామినివై వెలసిన నీ

మోముజూపి భవమోచని రాఘవునకు భువి

కామితములిడి కరుణబ్రోచు కామేశ్వరి ॥నీ సేవకు॥

42. చక్రవాక – ఆది

పల్లవి: నీకే దయరాదా జననీ నాపై
నేరములెల్ల సైరించి బ్రోచుటకు ॥నీకే॥

అనుపల్లవి: రాకేందుముఖి సదాశివరాణివై
రాజిల్లుచూ త్రిభువనరక్షణివైన ॥నీకే॥

చరణము(లు):
భారమైన భవబాధలణచి కడ
తేర జూచి కరుణించుట కెవరే
మారజనకసోదరి శంకరి నను
చేర బిలిచి నీకుమారునిగా జూడ ॥నీకే॥
ఏవేళను నాకీవే గతియని
భావించి నీ పదభక్తి జేసెద
రావే దీనరక్షకి రాఘవుని
సేవలందుకొని బ్రోవను మదిలో ॥నీకే॥

43. ముఖారి – రూపక

పల్లవి: నీపయి నామనసు నిల్ప
నిశ్చలభక్తి నీయవె అంబా ॥నీ॥

అనుపల్లవి: చపలాత్ముడనై తిరిగి నీ
చరణాంబుజ సేవ మరచితి ॥నీ॥

చరణము(లు):
కలిలో దారసుత ధనకాంచనముల గని భ్రమించి
కలుషాత్ముడనైతి రాఘవుని కరమిడి కడు ముదమలరగ॥నీ॥

44. ఆనందభైరవి – మిశ్రచాపు

పల్లవి: నేడే నిను సేవింపవలె గాని

నిత్యముగా యీ తనువు నిలువనేర్చునే ॥నేడే॥

అనుపల్లవి:

వడిగా కామక్రోధములచే బెనగొని

కడకు కాలునిబారి కడగండ్లుబడ మేలే ॥నేడే॥

ముక్తాయి స్వరము:

చరణము(లు):

అరిషడ్వర్గము నణచి

అన్నిట నీవై వెలిగే అంతర్భావము దెలిసి

పరమ దయానిధి నీ పదములే గతియని

దురితహారిణి రాఘవుని దుడుకుదీర ॥నేడే॥

45. ప్రణవప్రియ – ఆది

పల్లవి: పదారవిందములే గతియని

సదా నమ్మితినికదా సనాతని ॥పదార॥

అనుపల్లవి: మదాసురగణవిదారిణివైన నీ కథా

సుధారసము ధాత్రి చవిగొని ॥పదార॥

చరణము(లు):

పురాణి నాయెడ పరాకుసేయక

మొరాలించి కదు బిరాన బ్రోవను

నిరాదరణ జేసితే నాకెవరు

వరాలొసగువారు రాఘవార్చిత ॥పదార॥

46. పూర్వీకల్యాణి – ఆది

పల్లవి: పరశివ సుదతీ పార్వతీ నీ

పదయుగ సేవాసక్తి గల నిజభక్తి నిడి బ్రోవవే ॥పర॥

అనుపల్లవి:

ధర నరుడై దొరకు ఈ నరజన్మమందే దృఢ

తరముగ నామది రంజిల్ల నిష్కామ భక్తితో నిను సేవింతు ॥పర॥

చరణము(లు):

తీరని భవ భారముచే ఈ భువి నిజ

దారసుత ధనయశోకాముడనై బరగి

ఏదారి దోచక నీదరి చేరి వేడితి జగత్

కారిణి భవతరణి జ్ఞానానంద తీర్థార్చిత ॥పర॥

47. నాదానందరంజని – ఆది

పల్లవి: పరాత్పరీ శివకామేశ్వరీ నీ

పదాబ్జములే మది సదాభజించు గౌరీ ॥పరాత్పరీ॥

అనుపల్లవి:

పురాణీ శరదిందునిభాననా

హరిహరాది సుర భూసురార్చితాఖండ ॥పరాత్పరీ॥

చరణము(లు):

ధరాతలిని మరపురాని నీ నామా

క్షరామృత పాన మేకాల మాశించి

శ్రీరాజేశ్వరీ సుహాసినీ నా

మొరాలించి బ్రోచు జ్ఞానానందతీర్థార్చిత ॥పరాత్పరీ॥

48. తోడి – సంకీర్ణజాతి త్రిపుట

పల్లవి:

పరాశక్తి సదా భక్తార్తిభంజనివి కదా ఓ ॥పరాశక్తి॥

అనుపల్లవి:

నిరాదరణ జూపి నా మొర విన

నిరాకరింప తగునా ॥పరాశక్తి॥

చరణము(లు):

దురాత్ములైన మానవాధములు నీదుమహిమలు దెలియక

పరాభవించి తనకు మనుపరాని బాధలిడ జూతురు

పురాణి ధర్మ సంవర్ధనివై తేజరిల్లుచు జగతిని

జరామరణములణచి రాఘవుని బిరాన బ్రోవుము ॥పరాశక్తి॥

59. బిలహరి – రూపక

పల్లవి:

పాదయుగ సరోరుహం

భజామ్యహం జననీ తవ ॥పాద॥

అనుపల్లవి:

వాదతర్కరహితాఖండ

నాదయోగిహృద్భాసిత ॥పాద॥

చరణము(లు):

పాపానలరూప భవసంతాపహరణ నిపుణతర సర

సామృత దృఘవీక్షణే పరిపాలయ మాం – భక్తరాఘవార్చిత ॥పాద॥

50. ధన్యాసి – చతురస్ర త్రిశ్ర ఆది (త్రిశ్రమార్గము)

పల్లవి: పాపమే జ్వరాది ఘోర

రూపమై బాధించు మనస ॥పాపమే॥

అనుపల్లవి:

భూపతికైనా సన్మౌని

పుంగవునికైనా బహు ॥పాపమే॥

చరణము(లు):

తెలిసి తెలియ కార్జించిన – కలుషము ప్రబలినవేళల

బలిమిని పలుతాపములచే – బడలినపుడె భవహరమట

ఫలరహితముగా శివసతి – పద మాశ్రయింపుమని రాఘవునికి ॥పాపమే॥

51. గౌళ – ఆది

పల్లవి: పార్వతీ నిరపరాధి నేగతి

పారజూచి పరిపాలింతువో శివసతి ॥పార్వతీ॥

అనుపల్లవి:

పూర్వార్జిత కర్మాధీనుడనై భువి

పుట్టి కీలుబొమ్మకైవడి యాడితినె ॥పార్వతీ॥

ముక్తాయి స్వరము:

చరణము(లు):

చెదరని భక్తి కుదరక కొన్నాళ్ళు

వదలని సుదతుల వలపుల కొన్నాళ్ళు

మదమత్సరముల మరిగి కొన్నాళ్ళు

తుదగతి రాఘవునికి దోచక కొన్నాళ్ళు గడచె ॥పార్వతీ॥

52. మాయామాళవగౌళ – రూపక

పల్లవి:

పిన్నవానిగా నన్ను – పిలచి బ్రోవవే భవాని ॥పిన్న॥

అనుపల్లవి:

తిన్నగా భవాబ్ధిదాటు – తెన్నుజూపి నీవు కన్న ॥పిన్న॥

చరణము(లు):

కర్మశేషమున బహు – కాయముల ధరించి జగతి

దుర్మదాంధుడనై తిరిగి – దురితములే జేసియుంటి

ధర్మరూపిణి దాక్షాయణి – దయచేసి రాఘవుని ॥పిన్న॥

53. సామ – ఆది

పల్లవి:

భక్తికి సమభాగ్యములేదని శివ

శక్తి నారాధింపలేవా ఓ మనసా ॥భక్తికి॥

అనుపల్లవి:

భుక్తిముక్తి ప్రదాయకి యని మది నిజా

సక్తితో స్వరలయాది రక్తి దెలసి జేయు ॥భక్తికి॥

చరణము(లు):

పూని ధర్మార్థకామముల నొసగు యాగ

పూర్ణుడైతె జనన మరణము లుడుగునా

రానుపోను మాను రాజమార్గమా దేవీ

గానసుధాపాన విజ్ఞానముతో రాఘవుని ॥భక్తికి॥

54. కేదార – ఆది

పల్లవి: భజింపలేదని మదిలో నను
త్యజింపకే నటరాజాంతరంగిణి ॥భజింప॥

అనుపల్లవి:
అజాదిసురమౌనిజోత్తముల వలె
నిజాంతరంగముతో నీ మూర్తిని॥భజింప॥

చరణము(లు):
హీనమగు భవకాననమున తుది
గాననగు సుజ్ఞాన మొసగు దేవీ
గానసుధాకరి భవహరి శంకరి
గానమెరిగి రాఘవుడు సుస్వరముతో ॥భజింప॥

55. కానడ – ఆది

పల్లవి: మదనారీవర సుదతి మహేశ్వరి
మాతంగి నాపై అభిమానమెన్నడు గల్గు ॥మదనారీ॥

అనుపల్లవి: మదరాక్షసహరి మాధవసోదరి నీ
పదరాజీవ సద్భక్తిసంపద నే కోరితి ॥మదనారీ॥

చరణము(లు):
ఆజన్మము నా అంతరంగమున
తేజరిల్లు నీ దివ్యరూపముగోరి
ఈజగతి నిన్నె పూజించు రాఘవుని
మోజుదీరగ నీ మోమొకసారి జూపవు ॥మదనారీ॥

56. సురట – ఆది

పల్లవి: మనసా సదాశివ మానిని

నామాక్షరము లేమరక భజింపవే ఓ ॥మనసా॥

అనుపల్లవి:

వనజాసన హరిహర సురపతులెల్ల

నెనరున త్రిభువనాధీశ్వరి యని పొగడిరి ॥మనసా॥

చరణము(లు):

పలు జనన మరణ బాధ లణచి ఇహ

పర సుఖము లిడి పరిపాలించునట

ఇల ఈ నరజన్మ మబ్బి యున్నపుడె స

ఫలముగ జేయవె జ్ఞానానంద తీర్థుని ॥మనసా॥

57. భైరవి – త్రిపుట

పల్లవి: మనసున నిన్నే గురిజేసి

మరులుకొన్నాను రావె అంబ ॥మనసున॥

అనుపల్లవి:

దీనసంరక్షకి నా

దిక్కు నీవని తెలిసి ॥మనసున॥

చరణము(లు):

త్రిపుర భైరవి నా త్రిప్పట లెల్ల దెలిసి

కృపసేయవలెగాని కోపముయేలనె

సాపరాధిని నీ సద్భక్తి గల

ప్రాపుగూర్చుటకు శివ ప్రాణనాయకి రాఘవుని ॥మనసున॥

58. తోడి – ఆది (తాన వర్ణము)

పల్లవి:

మీనాక్షీ నీదు పదపంకజములె

మిక్కిలి నమ్మితినమ్మ మధుర ॥మీనాక్షీ॥

అనుపల్లవి:

మారారికి ప్రియమానినీమణివైన

మహేశ్వరి బుధజన మనోభీష్టదాయినీ అంబ ॥మీనాక్షీ॥

ముక్తాయి స్వరము:

చరణము(లు):

దారిజూపి భవకానన మెటు దాటింతువో ॥మీనాక్షీ॥

59. పూర్వీకల్యాణి – రూపక

పల్లవి:

ముందువారలేమైరో – మోహపాశబద్ధులైన మన ॥ముందు॥

అనుపల్లవి:

సుందరాంగులగూడి తాగి – తందనాల ప్రొద్దుబుచ్చిన ॥ముందు॥

చరణము(లు):

కన్నతల్లిదండ్రులనక – అన్నదమ్ములాత్మజులనక

పున్నెకార్యముల నెరుగక – భూతలమున విఱ్ఱవీగి

చిన్ననాటనుండి ఎంతో – వన్నెలాడుల వలల జిక్కి ॥ముందు॥

పన్నగధర నిజభామిని – రాఘవనుత గుణశాలిని

సన్నిధిజేరి భజించుట – కేమరి సోమరితనమున చెడి ॥ముందు॥

60. అఠాణ – రూపక

పల్లవి: యోగసుఖ వియోగున కను
రాగమెటు జనించు నీపై అంబ ॥యోగ॥

అనుపల్లవి:
భోగజనిత విషయాదుల
త్యాగిగాక విరాగినని పల్కు ॥యోగ॥

చరణము(లు):
వారనిభవవారిధి దాటు
తరణివై కడతేర్తువనుచు మన
సార నీపద సారసభక్తి
గోరియున్న రాఘవుని జ్ఞాన ॥యోగ॥

61. మోహన – ఆది

పల్లవి: రాజరాజేశ్వరి నీపద
రాజీవములె నమ్మితినమ్మ నట ॥రాజ॥

అనుపల్లవి:
ఈ జగాన దయానిధియని పేరై
తేజరిల్లు జగదేకజనని శ్రీ ॥రాజ॥

చరణము(లు):
భావజరిపు హరి విధి సురపతులెల్ల
సేవింపగ మందహాసముతో కొలువై
ఈ వసుధ ధర్మపాలనజేయు
పావనమూర్తి భక్త రాఘవపాలిని శ్రీ ॥రాజ॥

62. కేదార – ఆది

పల్లవి: రారె రమణులంతా శ్రీ రాజ
రాజేశ్వరికి కర్పూర హారతు లివ్వ ॥రారె॥

అనుపల్లవి:
తీరెరిగిన త్రిభువనపాలినిగా తా
పార జూచి భక్తపాలన జేయునట ॥రారె॥

చరణము(లు):
హరిహరసుర మునివరులెల్ల సేవింప
దరహాస వదనయై దయజూపు వేళనే ॥రారె॥
భారమనక భవ బాధలణచి మన
సార వరము లిచ్చి లాలించు లలితాంబ చెంతకు ॥రారె॥
అన్ని వేళల ఈ నరజన్మమందె మనను
కన్నతల్లిగా బిలచి గారవించునట ॥రారె॥
మానక శ్రీ దేవీగానసుధా రస
పాన మత్తచిత్తులై జ్ఞానానందతీర్థునితో ॥రారె॥
పరమ భక్తజనపాలిని కమల కపాల గదాంకుశ
ధారిణి శూలిని నేమరక సదా మాధవ సోదరి
నామభజన మనసార జేయుచూ ॥రారె॥

63. రీతిగౌళ – మిశ్రజాతి చాపు

పల్లవి: రావమ్మ జననీ శ్రీ రాజరాజేశ్వరి మాయింటిదాక ॥రావమ్మ॥

అనుపల్లవి: భావజారి హరిబ్రహ్మేంద్రాది సురగణములగూడి ॥రావమ్మ॥

చరణము(లు):

రాజిల్లు శరన్నవరాత్రులందు నీసేవ

మోజు దీరగజేసి మ్రొక్కెద సాష్టాంగముగ

ఈ జన్మమందే నీకృప యేర్పడజూచి రాఘవునిబ్రోవ ॥రావమ్మ॥

64. పూర్వీకల్యాణి – ఆది

పల్లవి: వదలిపోయేనాడు నీవెంటతోడై

వచ్చువారెవరున్నారే ఓమనసా ఈ తనువు ॥వదలి॥

అనుపల్లవి:

విధివశుడై తానెడతెగ కార్జించి

పొదుపుజేసిన పుణ్యపాపములే గాక ॥వదలి॥

చరణము(లు):

ప్రేమజూపు నిజభామామణిగాని

నోముల నోచికన్న ఆత్మజులేగాని

పామరుడై బాగాదాచిన ధనముగాని

ఈ మహిలోనే విడచి యమకింకరులపాలై ॥వదలి॥

మేరలేని భోగభాగ్యములందు మోజు

దీరక బహుదుర్విషయాదుల మరగి

ఘోరపాప కర్మాధీనుడై రాఘవుని

దూరి శ్రీ దేవీగానసుధా పానము జేయక ॥వదలి॥

65. రీతిగౌళ – ఖండత్రిపుట

పల్లవి: వలసినదేమీ జననీ మాకీ

వసుధ నీదు పదవనజ భక్తికన్న గా ॥వలసిన॥

అనుపల్లవి:

పలువిధముల భవబాధలణచి బ్రోచె శివ

భామినివై మాపాల గల్గియుండగా ॥వలసిన॥

చరణము(లు):

ఆనాడె కదు చిరుప్రాయమున రాఘవుని

శ్రీనాథానంద సద్గురు లతి కృపతో

నీనామ జపవిధి నిధులను బోధించి

జ్ఞానానంద పరతత్వాయత్త చిత్తుని జేసె ॥వలసిన॥

66. మధ్యమావతి – రూపక

పల్లవి: విడచి సుఖింపవె మనసా దు

ర్విషయాదులపై మోహము ॥విడచి॥

అనుపల్లవి:

అడవిచరించు మృగసమ

నడతలపై గల తమకము ॥విడచి॥

చరణము(లు):

కామ మోహ లోభముల – కలకాల మీ భవకాననమున

కామినీమణిపై ప్రేమ – కాంక్ష లుడుగనేరక మరి

సోమరివయి బహు దుర్మో – హములజిక్కి సొలసిన నిను

కామరిపు సతీమణి ఎటు – గాచును రాఘవునివలెను ॥విడచి॥

67. మణిరంగు – ఆది

పల్లవి: విన్నానమ్మా జననీ నీకథ

లెన్నో భక్తాపన్నరక్షణివైనటు ॥విన్నా॥

అనుపల్లవి:

అన్నపూర్ణేశ్వరి ఇలలో ఆ

కొన్నవారి కమృతాన్నమిడి బ్రోతువని ॥విన్నా॥

చరణము(లు):

పావన గంగాతీరమందు

బరగు వారణాశిపురిని వెలసిన

భావజరిపు ప్రియభామినివై భూ

భారమణచు రాఘవార్చిత భాగ్యమని ॥విన్నా॥

68. సావేరి – త్రిశ్రజాతి త్రిపుట

పల్లవి: వెఱ్ఱినమ్మికతో నీ – విఱ్ఱవీగుటె కాని తుద

కొఱ్ఱగింజైనా వెంట – గొంపోవనగునె మనసా ॥వెఱ్ఱి॥

అనుపల్లవి:

కుఱ్ఱతనయ ధన కోమలి నిజబంధు

తారుమారులరయు దాయాదులకులోనై॥వెఱ్ఱి॥

చరణము(లు):

శమదమాది సద్గుణశాలివై నీలోని

ప్రేమరూపమౌ నిజపెన్నిధిని గనవే

వేమారు రాఘవుని పామరత్వమణచి శివ

కామినీమణిగూర్చు కైవల్య మెరుగ ॥వెఱ్ఱి॥

69. రీతిగౌళ – ఖండజాతి త్రిపుట

పల్లవి: వే రెవ్వరమ్మ జనని నీసరి

వేల్పు జగతిలో భవాని పావని ॥వేరె॥

అనుపల్లవి:

తీ రెరుగక సకల తీర్థముల మునిగి కడ

తేరేరా మనుజులు కామిత ఫలదాయకి ॥వేరె॥

చరణము(లు):

బాలేందు నిభానన నీ నామ ప్ర

భావ మెరుగక సద్భావ దరిద్రుడై

చాలా దుర్మోహజాలముల జిక్కి విడ

జాలని రాఘవుని బ్రోవను ॥వేరె॥

70. శంకరాభరణము – ఆది

పల్లవి: వేషధారుడైన నరునికిలలో వి

వేక మెటుజనించు మనసా నిగమతత్వ ॥వేష॥

అనుపల్లవి:

భాషణాచతురుడై పామరులచెంత

ఆర్షేయుడనని బల్కు దేశదిమ్మరి ॥వేష॥

చరణము(లు):

వేదశాస్త్ర పురాణేతిహాసాది

విద్యాపారంగతుని కైవడి తా

సాధులక్షణాదక్షుని మాడ్కి నటించి

వాదిడి రాఘవుని వంచించు కుతంత్ర ॥వేష॥

71. దర్బారు – ఆది

పల్లవి: శంకర కోమలి శరణుజొచ్చితి నీ పద

పంకజములె నమ్మి భవభయహారి శివ ॥శంకర॥

అనుపల్లవి:

సంకటముల దీర్చి సద్భక్తి గూర్చి నా

వంకజూచి బ్రోతువని వరదాయకి శివ ॥శంకర॥

చరణము(లు):

సరసామృత దుఘవీక్షణముచే నన్ను

పారజూచి పరిపాలింతువని

స్మరజనక సోదరీ చిరకాలముగా

చేరి నీ సన్నిధిని రాఘవనుత ॥శంకర॥

72. శంకరాభరణము – ఆది

పల్లవి: శంకరార్ధ శరీరిణి నీ పద

పంకజములె మైమరచి సేవించెద శివ ॥శంకరార్ధ॥

అనుపల్లవి:

సంకటహారిణివని సదా ఘన

కంకణములు గల కామేశ్వరి అంబ ॥శంకరార్ధ॥

చరణము(లు):

శక్తి దెలిసి నీ నామాక్షరము లా

సక్తి జపించు సుభక్తుడౌ రాఘవునికి

ముక్తి ప్రదాన మొసగు పరాశక్తి

తర్కములెల్ల మాని తాతోంధిత్తోం తకధిత్తా మ్మని ॥శంకరార్ధ॥

73. బేగడ – రూపక

పల్లవి:

శక్తి జగజ్జననీ పాహీ పాహిమాం పరా ॥శక్తి॥

అనుపల్లవి:

భక్తజనాభీష్టప్రద భాగ్యసంవర్ధని శివ ॥శక్తి॥

చరణము(లు):

సారాసారవిచార హృదయ విహారిణి

ధీరాతిధీర దనుతశూరాంతకి త్రిశూలిని

ఘోరాతిఘోర భవనీరధిజనతరణి

శ్రీరాఘవారిచయ సారసంహారిణి ॥శక్తి॥

74. ఫరజు – ఆది

పల్లవి:

శైలతనయ నీ పాటి

కైవల్య మొసగు వారెవరె హిమ ॥శైల॥

అనుపల్లవి:

కైలాసాధిపునికి ప్రియ

కామినీయని నిను నిష్కాములై సేవించు వారికి ॥శైల॥

చరణము(లు):

భువనము లెల్ల నీ కుక్షి నిడుకొని

సవివరముగ సాకు సనాతని

భువనేశ్వరి శుకపాణి సుహాసిని

భవనీరధిని నిర్భయముగ రాఘవునికి ॥శైల॥

75. జంఝూటి – ఆది

పల్లవి: శ్యామలగాత్రి పరాశక్తి అంబ ॥శ్యామల॥

అనుపల్లవి:

వేమరు నిజభక్త వేదనల హరించు

వేల్పు నీవేగదటె వేదాతీత ॥శ్యామల॥

చరణము(లు):

భారమటే దీన – పాలినివైన త్రిశూలిని

నన్ను బ్రోవవే కపాలిని ॥శ్యామల॥

కోరితి పరశివ – కోమలి నీ సేవ

భారమనియంటినా పద్మాసని ॥శ్యామల॥

తోయజముఖి తల్లి – తోడు నీవేయని

దోసిలొగ్గు రాఘవదాసావని ॥శ్యామల॥

76. వలజి – ఆది

పల్లవి: శ్రీ గాయత్రీదేవి సనాతని సేవకజన సుశ్రేయోదాయిని ॥శ్రీ॥

అనుపల్లవి:

వాగధిపతి సురేంద్రపూజితే

వరదాయకి పంచవదనే సుహాసిని ॥శ్రీ॥

చరణము(లు):

రాగద్వేష రహితాంతరంగ హితే

రత్నఖచిత మణిహారమండితే

రసహిత సంగీత మోదితే

రాఘవాది భక్తరక్షణ చరితే ॥శ్రీ॥

77. ఫరజు – ఆది

పల్లవి: శ్రీకాంత సోదరీ నన్నుబ్రోవ

చీకాకుపడెద వేకారణమొ ॥శ్రీకాంత॥

అనుపల్లవి:

ఏకాంతముగా శివునిగూడు వేళా

రాకేందుముఖి భక్తార్తి దీర్పలేవా॥శ్రీకాంత॥

చరణము(లు):

సంచితాగామి ప్రారబ్ధసంభవమౌ

ఎంచరాని జననమరణముల వారించె

పంచశరహరుని పడతీ నీదు బిరుదా

లించి వేడుకొను రాఘవుని శంకించి ॥శ్రీకాంత॥

78. ఫరజు – ఆది

పల్లవి: సదాశివనాయకీ అంబ భవజల

ధీ దాటించుట కభయదాన మొసగు ॥సదాశివ॥

అనుపల్లవి:

చిదానందము గూర్చు నీపదభక్తి

చిన్ననాడే గోరియున్నానుగా జననీ ॥సదాశివ॥

చరణము(లు):

దండివేల్పుగ నా హృత్పుండరీకమందు

నిండి తాండవించఖిలాండేశ్వరీ

చండీ కామాక్షీ బాలచంద్రనిభానన నీ

యండజేర్చి రాఘవుండనే దయతో ॥సదాశివ॥

79. బేహాగ్ – ఖండజాతి త్రిపుట

పల్లవి: సద్గురుచరణ సరోరుహ భక్తి వినా
సద్గతిగూర్చు సుసాధనము లేదన్నా ॥సద్గురు॥

అనుపల్లవి:
సద్గుణయుత శమదమాది సంపదనిడి
చిద్ఘనానంద సుధాకరుడై వెలిగే ॥సద్గురు॥

చరణము(లు):
అతులిత భవభయబాధలణచి సుజ్ఞాన
తతినిగూర్చు పరతత్వ చతురుడే
హితవుమీర నిత్యానిత్యముల బోధించి
సతతము రాఘవమానస సన్నుతుడౌ శ్రీ॥సద్గురు॥

80. జనరంజని – సంకీర్ణజాతి త్రిపుట

పల్లవి: సారహృదయులై కడతేరుట కేనాటికైనా జిత సం
సారులుగావలెరా సనాతనధర్మయుత సత్కర్మఫల ॥సార॥

అనుపల్లవి:
దారసుతధనాసక్తులై పెడదారిబట్టి పలుజన్మల కడ
తేరె తరుణోపాయమెరుగక దుర్మతులై తిరుగువారిల ॥సార॥

చరణము(లు):
ఇలలో అరుదై దొరకే యీనరజన్మమందే పోరాడి
తలపులెల్ల శివసతిపై నిలిపి పరతత్వాయత్తచిత్తులై
కులమతవర్గభేదముల గుట్టెరిగి కుతర్కములెల్లవీడి ని
ర్మల మానసులై రాఘవనుత పునరావృత్తరహిత పథము సాధించి ॥సార॥

81. వివర్ధిని – ఆది
పల్లవి: సితనగ నిలయుని సుదతీ సుమతీ
శ్రితజనానంద చిద్రూపిణి ॥సితనగ॥
అనుపల్లవి:
వితరణగా నా విన్నపమాలించి
వెతదీర్ప నిదేవేళ వివర్ధిని ॥సితనగ॥
చరణము(లు):
పురాతనముగా ధరాతలిని కడు
విరామములేని జరామరణముల
పురాణి వగజెందు రాఘవుని గని
వరాలొసగి బ్రోవ రావలె జనని ॥సితనగ॥

82. శుద్ధధన్యాసి – ఆది
పల్లవి: సుందరి సదా నీ పదార
విందములకు నా వందనమే త్రిపుర ॥సుందరి॥
అనుపల్లవి:
కందర్పజనకసోదరి శర
దిందునిభానన డెందమలర పర శివ ॥సుందరి॥
చరణము(లు):
స్వాంతమున విషయభ్రాంతులుడిగి నిన్న
శ్రాంతము దలచు విశ్రాంతిగల వే
దాంతులకిడు ముక్తికాంతామణి నొసగి
కుంతలాంబ రాఘవుని కోర్కెదీర్చు ॥సుందరి॥

83. ఆభోగి – ఆది

పల్లవి: సుమశరహరవర సుదతీ పార్వతి
సులభముగా భవజలధి దాటింపవే ॥సుమ॥

అనుపల్లవి:
కమలేక్షణ ధనదారసుతులపై
మమతవీడి నిన్నే మరిమరి వేడితి ॥సుమ॥

చరణము(లు):
ఆగమ విధియుత స్వాగతమొసగి
రాగరహితుడై రంజిల్ల పూజించి
రాగతాళస్వర రక్తిభక్తిజ్ఞాన
యోగముచే నిను వేడు రాఘవు నీవేళ ॥సుమ॥

84. ఆరభి – ఖండజాతి త్రిపుట

పల్లవి: స్వరజనితోంకారనాదాఖండ పం
జరపు చిలుక నేమరక భజింపర సప్త ॥స్వర॥

అనుపల్లవి:
అరవిందాసనహరిహరులకెల్ల మూలా
ధారమైనెగడు చిదానందమూర్తి యగు ॥స్వర॥

చరణము(లు):
విమలాత్మాగ్ని మనోనిల ప్రేరణముచే
క్రమగతి నాభీహృత్కంఠమూర్ధాస్యములయందు
కమనీయ నాదసుధాకలశముద్భూతమౌ
మర్మమెరిగి యాజన్మము రాఘవసన్నుత సు ॥స్వర॥

85. మధ్యమావతి – ఆది

పల్లవి: హరనారీ నామాక్షరరుచి యే
నరునికి దొరకునో మనసా స్మర॥హర॥

అనుపల్లవి:
సురకిన్నరకింపురుష భూ
సురమానసమున కగోచరమా ॥హర॥

చరణము(లు):
పులకాంకితుడై పూని వివిధ సుమ
ముల పూజించి భువనేశ్వరి సన్నిధి
కలకాల మెడతెగని భక్తి భూ
తలమునజేయు రాఘవనుతునికే గాక ॥హర॥

86. సురట – ఆది

పల్లవి:
హారతి జేకొనవే అంబా జయ ॥హారతి॥

అనుపల్లవి:
మారవైరి ప్రియ – మానినీ నీదు కు
మారుడ నే అభి – మానముజూపి కర్పూర ॥హారతి॥

చరణము(లు):
నవమణిమయ సిం – హాసనమున కొలువై
నతపాలన మొన – రించు సనాతనీ
పావనమగు నీ – నామ భజన లోక
పావనమే గదా – భవహరి రాఘవుని ॥హారతి॥